www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 19 | అక్టోబర్ | 2026
పేజీలు : 6

## ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ




**-తాగునీటికి తొలి ప్రాధాన్యత**

**-ప్రత్యేక అధికారి అనుదీప్ దురిశెట్టి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఎనిమిది నెలల ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేకాధికారి అనుదీప్ దురిశెట్టి తెలిపారు. వ్యవసాయం, విద్యుత్, సాగు, తాగునీరు, భూగర్భ జలాల పరిరక్షణకు పకడ్బందీ కార్యాచరణ రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఉమ్మడి జిల్లా అధికారుల సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని ప్రత్యేక పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. గతేడాది వర్షపాతంతో ప్రస్తుత ఏడాది వర్షపాతాన్ని పరిశీలించాలని లోటు వర్షపాతం నమోదైన మండలాలను గుర్తించి

మిగతా 2లో..

# వారు నిర్మించారు.. వీరు వదిలేశారు..!

**-కంపోస్టు షెడ్లను పట్టించుకోని పంచాయతీలు**

**-చిట్టడవులను తలపిస్తున్న క్రీడా ప్రాంగణాలు**






**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలోనూ కంపోస్టు షెడ్లను నిర్మించింది. గ్రామాల్లో తడి, పొడి చెత్తను ఎరువుగా మార్చడానికి ఈ షెడ్లను నిర్మించారు. ఆయా షెడ్లకు మూడు లక్షల నుంచి నాలుగు లక్షల రూపాయల వరకు ఖర్చు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సేంద్రియ వ్యర్థాలను కూరగాయలు, ఆకులు, చెత్త మొదలైన వాటిని సేకరించి కుళ్లబెట్టి నాణ్యమైన ఎరువుగా మార్చేందుకు ఈ షెడ్లను ఉపయోగించాల్సి ఉంది. చెత్త వృధాకాకుండా ఎరువుగా మారిస్తే వ్యవ సాయ భూములకు

మిగతా 2లో..

## విచిత్ర వాతావరణంతో ప్రజల అవస్థలు..!



**-పగలు ఎండ తీవ్రత.. రాత్రి చలి తీవ్రతతో ఇబ్బందులు**

**-వాతావరణ మార్పులతో పంటలపై రైతుల ఆందోళన**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** పగటిపూట ఎండ తీవ్రత, రాత్రివేళ చలి పెరుగుతుండటంతో జూలూరుపాడు మండలంలో వాతావరణం అనూహ్యంగా మారుతోంది. ఉదయం చలి వాతావరణం ఉండగా, మధ్యాహానికి ఎండ తీవ్రత పెరుగుతోంది. రాత్రి మళ్లీ చలి మొదల వుతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ వర్షా భావ పరిస్థితులతో సాగునీటి కొరతే నెలకొనగా, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు రైతుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. పగటి ఎండతో పొలాల్లో తేమ వేగంగా ఆవిరై పోతుండటంతో పంటలకు నీటి అవసరం పెరుగుతోంది. దీంతో బోర్లు, మోటార్లపై రైతులు ఆధారపడాల్సి వస్తోంది.

**పంటలపై ప్రభావం ఉంటుందేమోనని ఆందోళన..**

రాత్రి, తెల్లవారుజామున చలి పెరుగు తుండటంతో పంటలపై ప్రభావం ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉష్ణోగ్రతల్లో మార్పుల కారణంగా తెగుళ్లు, పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఎరువులు, పురుగు మందుల ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు పంట నష్టాలు ఎదురైతే పెట్టుబడి భారం మరింత పెరిగే అవకాశం ఉంది.

**ప్రజలకూ తప్పని ఇబ్బందులు...**

వాతావరణ మార్పులతో సామాన్యులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెల్లవారుజామున చలితో వృద్ధులు, చిన్నా రులు అవస్థలు పడుతుండగా పగటి పూట ఎండలో వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. పంటల పరిస్థితిని పరిశీ లించి రైతులకు అవసరమైన సూచనలు, జాగ్రత్తలను వ్యవసాయ శాఖ అదికా రులు తెలియజేయాలని రైతులు కోరుతున్నారు. వర్షాభావ పరిస్థికులకు తోడు వాతావరణ మార్పులతో పంటలకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యత



**-రహదారుల నిర్మాణానికి రూ. 90వేల కోట్లు**

**-ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు**

**-ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, రాష్ట్రాభివృద్ధికి తొలి ప్రాధాన్యత నిస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా రహదారులను అభివృద్ధి చేస్తున్నామని ఆయన తెలిపారు. ఆదివారం ఖమ్మం జిల్లా ఏన్కూరు, వైరా మండలాల్లో భట్టి విక్రమార్క పర్యటించారు. తొలుత ఏన్కూరు సమీపంలోని నాచారం అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడే రూ. 44 కోట్లతో నిర్మించే రహదారి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రహదారి నిర్మాణంతో భక్తులకు సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా స్థానికంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి రూ. 2, 500 కోట్లతో పనులు చేపట్టామని తెలిపారు. ఇందులో గోదావరి పరివాహక ప్రాంత ఆలయాల అభివృద్ధికి రూ.2వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ.276 కోట్లు, బాసర ఆలయ అభివృద్ధికి రూ.354 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజల అవసరాలను తీర్చడం ప్రభుత్వ

మిగతా 2లో..

# వారు నిర్మించారు.. వీరు వదిలేశారు..!





**(మొదటిపేజీ తరువాయి)**

ఉపయోగపడడంతో పాటు పంచాయతీలకు ఆదాయం ఉంటుంది. పైగా చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఉండడంతో పాటు పారిశుధ్య పనులు సులువు అవుతాయి. కంపోస్టు షెడ్లలో ఉత్పత్తి అయిన ఎరువులకు కూడా మంచి డిమాండ్ కూడా ఉండడంతో పంచాయతీలకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ప్రభుత్వమైతే లక్షలు వెచ్చించి షెడ్లు నిర్మించారు కానీ ఎక్కడ కంపోస్టు ఎరువులను తయారు చేసే పరిస్థితి లేదు. ప్రభుత్వం మారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కంపోస్టు షెడ్లతో పాటు క్రీడా ప్రాంగణాలను కూడా వదిలేశారు. గ్రామ పంచాయతీల్లో చెత్తను సేకరించి బహిరంగ ప్రదేశాల్లో వేయడంతో పారిశుధ్య సమస్య తలెత్తి అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కొన్ని గ్రామ పంచాయతీల్లో చెత్తను తగలబెడుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీలోనూ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అప్పటి ప్రభుత్వం క్రీడా ప్రాంగణాల ఏర్పాటును తప్పనిసరి చేయడంతో గ్రామ పంచాయతీలు స్థలాలు ఉన్న చోట ఆట స్థలాలను ఏర్పాటు చేశాయి. స్థలాలు లేని చోట భూములను లీజుకు తీసుకుని ఆట స్థలాలను ఏర్పాటు చేశారు. ఒక్కో ఆట స్థలానికి ఐదు లక్షల నుంచి పది లక్షల వరకు ఖర్చు చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని 19వేల గ్రామాలు, మున్సిపాలిటీ, కార్పోరేషన్ వార్డుల్లోనూ వీటిని ఏర్పాటు చేశారు. భూములు లీజుకు తీసుకున్న చోట రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రిని పక్కనపెట్టి దున్ని పంటలను సాగు చేసుకుంటున్నారు. మిగిలిన చోట్ల పిచ్చి మొక్కలు మొలిచి చిట్టడవులను తలపిస్తున్నాయి. అరకొరగా ఏర్పాటు చేసిన క్రీడా సౌకర్యాలు కూడా ఇప్పుడు పనికిరాకుండాపోతున్నాయి. ఇందుకు సంబంధించి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచులకు బిల్లులు రాలేదని ఇప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఒక సదుద్దేశంతో ఏర్పాటు చేసిన కంపోస్టు షెడ్లు, క్రీడా ప్రాంగణాలు ఇప్పుడు నిరూపయోగంగా మారుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా చూసినప్పుడు వందల కోట్ల ప్రజాధనం మట్టిపాలైంది. ఇప్పటికైనా ప్రజా ధనం వృధాకాకుండా కంపోస్టు షెడ్లను, క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యత





**(మొదటిపేజీ తరువాయి)**

ప్రధాన బాధ్యత అని ఇందులో భాగంగా రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పది లక్షల వరకు ఉచిత వైద్యం, 71 లక్షల మంది రైతులకు రైతు భరోసా, 53 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్సు, సామాజిక భద్రత పింఛన్లు మొదలైన సౌకర్యాలను, సంక్షేమాలను అమలు చేస్తున్నామన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఐదు లక్షల చొప్పున సాయం అందిస్తూ రాష్ట్రంలో ఎనిమిది లక్షల ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహారాన్ని అందిస్తున్నామని డైట్ ఛార్జీలను, కాస్మోటిక్ ఛార్జీలను పెంచామని తెలిపారు. రాష్ట్రంలో రూ. 90 వేల కోట్ల రూపాయలతో రహదారుల అభివృద్ధి చేపట్టామని, విద్యుత్ డిమాండ్ 20వేల మెగా వాట్లకు పెరిగిన నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. వైరా నియోజక వర్గానికి సంబంధించి మరో బిటి రోడ్డును మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకు రావడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వర రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంప్రదాయ నృత్యాలు, డప్పు చప్పుళ్లతో భట్టికి ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీ నిర్వహించారు.

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ

**(మొదటిపేజీ తరువాయి)** ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. భూగర్భ జలాలు తగ్గుతున్న మండలాలను గుర్తించి రానున్న కాలంలో భూగర్భ జలాల పరిరక్షణకు సంబంధించి చర్యలు తీసుకోవడంతో పాటు ప్రత్యామ్యాయ చర్యలను చేపట్టాలని ఈ విషయాలను ప్రజలకు తెలియజేయాలని ఆయన ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని అవసరమైన సహకారం కోసం ప్రత్యేక నివేదికలు సమర్పించాలన్నారు. ఖమ్మం జిల్లాలో కామేపల్లి మండలంలో ఐదు మీటర్లు, ఎర్రుపాలెంలో 6.5 మీటర్లు, సత్తుపల్లిలో 5 మీటర్లకు పైగా భూగర్భ జల నీటిమట్టం తగ్గినట్లు ఆయన తెలిపారు. దమ్మపేట, అశ్వారావుపేట, కొత్తగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో 10 మీటర్లకు పైగా భూగర్భ జల నీటి మట్టం తగ్గిందన్నారు. భూగర్భ జలాలను పరిరక్షించేందుకు బోర్లు వేయడాన్ని నిరోధించాలని నిరంతం నీరు తోడే ప్రక్రియకు విరామం ప్రకటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఈవోలు, రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తాగునీటి అవసరాలకు మినహా కొత్త బోర్లకు అనుమతి ఇవ్వరాదని వాల్టా చట్టాన్ని అధికారులు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. వరి సాగు ఆశించిన స్థాయిలో తగ్గలేదని రబీ సీజన్‌లో మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వరి సాగు చేపట్టకూడదని ఆయన రైతులకు సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ పంటలను కాపాండేందుకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని భక్తరామదాసు ప్రాజెక్టు పంపుల మరమ్మతులను వెంటనే చేపట్టాలని ఆయన సూచించారు. ఏ చెరువులోనైనా తాగునీటి అవసరాలకే వినియోగించాలని పాలేరు, వైరా రిజర్వాయర్లకు తాగునీటికి సరిపడ నీటిని నిల్వచేయాలన్నారు. విద్యుత్ సరఫరాపై అప్రమత్తంగా ఉండాలని పశువులకు నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచాలన్నారు. ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో 16 మండలాల్లో లోటు వర్షపాతం ఉందని 10 మండలాలను తీవ్ర కరువు మండలాలుగా, ఏడు మండలాలను సాధారణ కరువు మండలాలుగా గుర్తించినట్లు తెలిపారు. గోదావరి జలాల ద్వారా 110 చెరువులకు నీటిని అందించినట్లు ఆయన తెలిపారు. పాలేరు రిజర్వాయర్‌లో నీరు 84 రోజులకు సరిపడుతుందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ 26.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని ఈ ఏడాది 2.68 మీటర్ల మేర భూగర్భ జల నీటిమట్టం తగ్గిందన్నారు. తాలిపేరు ప్రాజెక్టు ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్నామని ఆయన తెలిపారు. ఖరీఫ్ పంటలకు ఇబ్బంది లేదన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, భూగర్భ జల, విద్యుత్, ఆరోగ్యశాఖాధికారులు పాల్గొన్నారు.

## పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం



**ప్రజాపక్షం/ఇల్లందు:** పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఇల్లందు ఎంఎల్‌ఏ కోరం కనకయ్య అన్నారు. టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్ రోడ్ గ్రామ పంచాయితీ పరిధిలోని రైతు వేదికలో తహసీల్దార్ వీరభద్రం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీని నిరంతరంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్ర తెలంగాణ అని పేర్కొన్నారు. కేంద్రంలో 15ఏళ్లుగా పాలించిన బీజేపీ ప్రభుత్వం కూడా తెలంగాణ తరహాలో సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని విమర్శించారు. నీట్ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీతో ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని అన్నారు. దేశ యువత బీజేపీని గద్దె దించి, రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని కోరుకుంటోందని వ్యాఖ్యానించారు. ఇల్లందు నియోజకవర్గ ప్రజలకు సద్దుల బతుకమ్మ, విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, టేకులపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కినేని శ్యాంబాబు, నాయకులు ఈది గణేష్, కాలే ప్రసాద్, రెడ్యా నాయక్, భూక్యా రవి నాయక్, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఓటు చోరీపై 23న దేశవ్యాప్త మహా ఉద్యమం




**ప్రజాపక్షం/భద్రాచలం:** దేశంలో జరుగుతున్న ఓటు చోరీ ఆరోపణలపై సమగ్రవిచారణ జరపాలని ఓటు చోరీ వ్యవహారంపై ఈనెల 23న దేశవ్యాప్త మహా ఉద్యమాన్ని చేపడుతున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయం చందర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీ దళిత మహిళ గిరిజనుల ఓట్ల తొలగింపే లక్ష్యంగా ఎన్నికల కమీషన్ తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చన్నారు. నరేంద్రమోడి, అమీత్షా నేతృత్వంలో ఎన్నికల కమీషన్ పనిచేస్తుందని, స్వతంత్ర ప్రతిపత్తి సంస్థగా ఉండే ఎన్నికల కమీషన్ కేంద్ర పాలకులు చేతిలో కీలుబొమ్మగా మారిందన్నారు. ఎన్నికల కమీషన్ తీరుపై తమకు అనేక అనుమానాలు ఉన్నాయని దీనిపై న్యాయస్థానం విచారణ జరపాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అమలు జరిపిన రాష్ట్రాల్లో కూడా ఎన్నికల నిర్వహణపై కూడా తగిన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధుల కేవలం రాజకీయ ప్రసంగాలకే పరిమితమ అవుతా ప్రజాపాలన, రైతుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని, ఓట్టు హక్కుపై ఉద్యమాన్ని నిర్వహిస్తూనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాటాలు ఏకకాలంలో నిర్వహిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్‌బాబు, పట్టణ కార్యవర్గ సభ్యులు డి సీతాలక్ష్మి, బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులకు అండగా ఉంటా.. : భట్టి



**ప్రజాపక్షం/వైరా:** ఆర్యవైశ్యుల న్యాయమైన కోరికలకు అండగా ఉంటానని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క హామీ ఇచ్చినట్లు ఆర్యవైశ్య ప్రముఖులు తెలిపారు. వైరా నియోజకవర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వైరాకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వైరా ఆర్య వైశ్య ప్రముఖులు రంగా జనార్ధన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఖమ్మం జిల్లా ఇంచార్జి గ్రంధి ప్రవీణ్, ఆయన బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైరాలో ఆర్యవైశ్యులకు కులదైవమైన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని నిర్మించాలని వారు ఉప ముఖ్యమంతిరని కోరారు. అలాగే ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఇంచార్జి ఆత్మకూరి శేషగిరిరావు, ఆర్యవైశ్య ప్రముఖులు మిట్టపల్లి శ్రీనివాసరావు, రాయల నాగేశ్వరరావు, మైలవరపు శ్రీనివాసరావు, తాటికొండ రాము, మిట్టపల్లి భాస్కర్, అనుమోలు శ్రీనివాసరావు, మొరిశెట్టి జనార్ధన్, చేగోసి కొండ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షులుగా రుద్రాక్ష బ్రహ్మం, ఉల్లి శ్రీనివాసరావు, బండారు బ్రహ్మం ల సమక్షంలో ఆదివారం మండల కేంద్రంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. సంఘం నూతన అధ్యక్షులుగా గంటల వెంకటాచారి, ఉపాధ్యక్షులుగా సంబోజు పరిపూర్ణాచారి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా ఇందోజు రవి, కోశాధికారిగా బజోజు శేఖర్, మహిళా కార్యదర్శిగా కొత్రేజు సునీత, గౌరవ సలహాదారులుగా తాటికొండ కృష్ణ, రుద్రాక్ష నర్సింహాచారి, తాటికొండ సత్యనారాయణ, కమిటీ మెంబర్లుగా బండారు నాగార్జున, రుద్రాక్ష నరేంద్ర కుమార్, ఎలగందుల శేఖర్, పోలోజు వెంకటాచారి, తోమాటి రామాచారి లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మండలంలో విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి, సంఘం బలోపేతానికి అందరి సహకారంతో శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. తమ ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన పెద్దలకు, సంఘం సభ్యులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

# ఘనంగా గంగవరపు విజయ్ 27వ వర్ధంతి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలంలోని ఎం,వెంకటాయపాలెం గ్రామానికి చెందిన సిపిఐ దివంగత నేత గంగవరపు విజయ్ 27వ వర్ధంతి వేడుకలను మండల సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమీషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండల సమితి ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మౌలానా, దండి మాట్లాడుతూ...రజాకారుల ప్రభావం బలంగా ఉండి కమ్యూనిస్టులను ఏరి వేస్తున్న తరుణంలోనూ విజయ్ చూపించిన తెగువ నేటి యువతకు ఆదర్శంగా పేర్కొన్నారు. ఎర్రజెండా చేతబట్టి పేద ప్రజల పక్షాన ఆయన చేసిన సేవలు అజరామరం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్దినేని కర్ణకుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎడ్లపల్లి శంకరయ్య, పగిళ్ల వీరభద్రం, బుర్ర నాగేశ్వరరావు, ఉన్నం రంగారావు, సిపిఐ మండల కార్యదర్శి



పుచ్చకాయల సుధాకర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షు,32వ వార్డు కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, సిపిఐ మండల సమితి సభ్యులు ఏలూరి భాస్కర్, బానోత్ జగన్, బట్ట బాబు, వెన్నం భాస్కర్, గోకినపల్లి రామ్మూర్తి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బూర మనోజ్, ఏఐఎస్ఎఫ్ సభ్యుడు సాయి, ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు మామిడాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వైరా మండలానికి సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయాలి

## ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు రైతుల వినతి



ప్రజాపక్షం/వైరా: వైరా మండలంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. ఈ మేరకు వైరా మున్సిపాలిటీ ఏడో వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు ఆధ్వర్యంలో రైతు పైడిపల్లి శ్రీను, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను వైరాలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బోనకల్లు మండలంలో వ్యవసాయానికి సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేసిన విధంగానే వైరా మండలంలోను ఈ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. సోలార్ పంపుసెట్ల ఏర్పాటుతో రైతులకు సాగునీటి అవసరాలు తీర్చుకోవడంలో తోడ్పాటు లభిస్తుందని, వ్యవసాయ రంగం అభివృద్ధికి మరింత ప్రోత్సాహం అందుతుందని పేర్కొన్నారు. వైరా మండల రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సోలార్ పంపుసెట్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చెరుకూరి శ్రీను, సరిపూడి కోటేశ్వరరావుతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# పెనుబల్లి గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి



ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కు ఆదివారం గ్రామ ప్రజలు, రైతులు, మహిళలు మరియు యువత ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే దృష్టికి గ్రామంలోని పలు కీలక సమస్యలను తీసుకెళ్లారు. పెనుబల్లి గ్రామంలోని ప్రధాన రహదారిని విస్తరించి, ఇరువైపులా శాశ్వత డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలనీ, అంతర్గత కాలనీల డ్రైనేజీలను ప్రధాన మురుగుకాల్వకు అనుసంధానించి, మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అలాగే నిలిచిపోయిన సి.సి. రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలనీ వర్షాకాలంలో బురదమయంగా మారుతున్న కచ్చా రోడ్ల కారణంగా పొలాలకు యంత్రాలు, ఎరువుల బండ్లు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్లకు మట్టి, గ్రావెల్ వేసి సిమెంట్ లేదా బి.టి. రోడ్లుగా మార్చి రవాణా సౌకర్యం కల్పించాలన్నారు.శ్మశాన వాటికల అభివృద్ధి: హిందూ శ్మశాన వాటికకు బి.టి. రోడ్డు నుండి సి.సి. రోడ్డు వేసి ప్రహరీగోడ నిర్మించాలి. ఎస్.సి. శ్మశాన వాటికకు చేతిపంపు ఏర్పాటుతో పాటు ప్రహరీగోడ నిర్మించాలన్నారు. అలాగే విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడేలా గ్రంథాలయాన్ని (లైబ్రరీ) ఏర్పాటు చేయాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి రాకుండా పాత చేతిపంపుల మరమ్మతులు మరియు కొత్త చేతిపంపులను ఏర్పాటు చేయా లన్నారు.ప్రజలకు ముప్పుగా మారిన 11 కే.వి. వేలాడుతున్న విద్యుత్ లైన్లను తొలగించాలి అన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి వారి సొంతింటి కల నెరవేర్చా లన్నారు. గ్రామంలో పరిశుభ్రత, అంగన్వాడీ భవనాలు, పాఠశాలల మౌలిక వసతులు, వైద్య సేవలు, క్రీడా ప్రాంగణం, బస్ షెల్టర్, సి.సి. కెమెరాలు, ఎల్.ఇ.డి. వీధి దీపాలు, పశువుల తాగునీటి తొట్లు ఏర్పాటు చేయాలి అన్నారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ తమ గ్రామాన్ని మోడల్ (ఆదర్శ) గ్రామంగా తీర్చిదిద్దాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో గ్రామస్తులు, మహిళలు యువత తదితరులు ఉన్నారు.

# జేవీఆర్ డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలకు భారీ ఏర్పాట్లు




ప్రజాపక్షం/సత్తుపల్లి: జేవీఆర్ డిగ్రీ కళాశాల 50 ఏళ్ల స్వర్ణోత్సవ వేడుకలను రెండు నెలల పాటు ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ అధ్యక్షతన కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలను విజయవంతం చేసేందుకు పలు సూచనలు, సలహాలు స్వీకరించి, వివిధ కమిటీలను ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులతో పాటు ప్రస్తుత విద్యార్థులందరూ సమన్వయంతో కృషి చేసి గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు.

# పల్లెకు చేరుతున్న పట్టణ ప్రజలు




ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు దూర ప్రాంతంలో ఉంటున్న జీవనం కోసం వెళ్ళిన ప్రజలు సొంత గ్రామాలకు చేరుతున్నారు. గృహాలన్నీ బంధువులతో మిత్రులతో నిండి ఉన్నాయి. పట్నం నుంచి వస్తున్న ప్రజలు, కుటుంబీకులు కుటుంబ సమేతంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు సొంత గ్రామాలకు అధిక సంఖ్యలో చేరుకుంటున్నారు. ఈ సమయంలో బస్సులు రైళ్లు సరిపడా లేకపోవడంతో నగర వాసులు సొంత వాహనాల్లో స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. దీనివల్ల కల్లూరు లోని ఎన్‌ఎస్‌పి, పాత బస్టాండ్ ,కొత్త బస్టాండ్ లో ప్రయాణికులు ఎక్కేందుకు దిగేందుకు పోటీ పడుతున్నారు. ఇప్పటికే కొంతమంది పల్లెలకు చేరుకోగా మరి కొంతమంది చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా గృహాల్లో తీపి వంటకాలు, గరంగరం వంటకాలు తయారు చేసుకుంటున్నారు. దసరా బతుకమ్మ ఉత్సవాలకు ప్రజలు మూడు నాలుగు తరాల వారు ఉత్సాహంగా ఉల్లాసంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. కల్లూరు టూ మధిర రహదారిలో బస్సులు తక్కువగా ఉండటం వలన ప్రయాణికులు పాట్లు పడుతున్నారు. అదేవిధంగా కల్లూరు టు ఖమ్మం హైదరాబాదు వెళుతున్న ప్రయాణికులకు అదనపు చార్జీలతో అదనపు వసూళ్లతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు వారు పేర్కొంటున్నారు. ఆదివారం సద్దుల బతుకమ్మ పండుగ కావడంతో ఎక్కువగా రద్దీగా ఉండే అవకాశం ఉంది. ఈ సమయంలో ప్రత్యేక సర్వీసులు ఆర్టీసీ నడుపుతున్నట్లు సమాచారం. ఆధార్ కార్డు ఉచితం ప్రయాణం కావడంతో మహిళలు ఎక్కువగా బస్ ప్రయాణం చేస్తున్నారు.

# నాలుగు కిలోల గంజాయి, నాటు తుపాకీ స్వాధీనం

## ఆరుగురు నిందితుల అరెస్టు

ప్రజాపక్షం/అశ్వారావుపేట : ఓ ఇంట్లో గంజాయి, జంతువుల వేటకు వాడే మరణాయాధాలు ఉన్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు దమ్మపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించి సుమారు నాలుగు కిలోల గంజాయి, నాటు తుపాకీ, వేటకు ఉపయోగించే సామాగ్రిని స్వాధీనం చేసుకోగా ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకునారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొడిశాలగూడెం గ్రామానికి చెందిన పెనుబల్లి కృష్ణ ఇంటిలో అటవీ జంతువుల వేటకు ఉపయోగించే మరణాయుధాలు, గంజాయి నిల్వ ఉన్నట్లు తెలిసిన నమ్మదగిన సమాచారం మేరకు ఫారెస్టు అధికారులు దాడులు నిర్వహించగా ఈ దాడుల్లో రెండు బ్యాగుల్లో బ్రౌన్ కలర్ కవర్లలో చుట్టబడిన మూడు కట్టల గంజాయి, వేటకు ఉపయోగించే సామాగ్రి, నాటు తుపాకీని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఆరుగురు నిందితులను అదుపులోకి



తీసుకుని వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, వాహనాలను స్వాధీ నం చేసుకున్నట్లు తెలిపారు. కూలీ పనులకు వెళ్లే వీరందరూ ఆదాయం సరిపోక డొంకరాయి, సీలేరు ప్రాంతాల నుండి తక్కువ ధరకు గంజాయిని తెచ్చి స్థానికంగా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు , కొంత గంజాయిని సేవిస్తున్న విచారణలో అంగీకరించినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

# సబ్ కలెక్టర్ ఆదేశించినా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్న అధికారులు

-పచ్చ గన్నేరుకుంటకు అందని సాగునీరు

-అయోమయంలో రైతులు..

-అధికారుల సమన్వయ లోపమే కారణమా?

ప్రజాపక్షం/వేంసూరు: సబ్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా పచ్చ గన్నేరుకుంటకు సాగునీరు అందకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లిఫ్ట్ ద్వారా విడుదల చేస్తున్న సాగునీటిని ఎన్టీఆర్ కాలువ ద్వారా మండల కేంద్రంలోని చెరువులకు తరలిస్తున్నప్పటికీ, పచ్చ గన్నేరు కుంటకు మాత్రం నీటిని విడుదల చేయడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ సమస్యపై పత్రికల్లో వచ్చిన కథనాలను పరిశీలించిన కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్ శనివారం పచ్చ గన్నేరుకుంటను సందర్శించారు. వెంటనే చెరువుకు సాగునీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ శాఖ డీఈఈని ఆదేశించారు. అయినప్పటికీ ఆదేశాల అమలులో జాప్యం జరుగుతుండటంపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. లిఫ్ట్, చెరువు కమిటీ చైర్మన్లు, ఇరిగేషన్ శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగానే పచ్చ గన్నేరుకుంటకు నీరు విడుదల కావడం లేదని రైతులు, మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారి ఆదేశాలిచ్చినా సాగునీరు అందకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పచ్చ గన్నేరుకుంటకు సాగునీటిని విడుదల చేసి, రైతుల సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# సత్తుపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా ఖాదర్ బాబా ఎన్నిక



ప్రజాపక్షం/సత్తుపల్లి: టియూడబ్ల్యూజే (ఐజేయూ) సత్తుపల్లి ప్రెస్ క్లబ్ సమావేశం పట్టణంలోని ఓ రెస్టారెంట్ లో ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎస్ కె. ఖాదర్ బాబా, జనరల్ సెక్రటరీగా బర్రె రామకృష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జర్నలిస్టుల ఐక్యత, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలనే ఆకాంక్షతో నూతన కమిటీ ఏర్పాటైంది.ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడు ఎస్కే ఖాదర్ బాబా, ప్రధాన కార్యదర్శిగా బర్రె రామకృష్ణలు ఎన్నిక కాగా, గౌరవ అధ్యక్షుడిగా బీవీ రామారావు, వైస్ ప్రెసిడెంట్‌గా కోటా అశోక్, జాయింట్ సెక్రటరీగా జంగం కిరణ్, కోశాధికారిగా ఎండీ మునీర్, ప్రచార కార్యదర్శిగా బట్టా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు త్రిమూర్తులు, నిమ్మగడ్డ శ్రీకాంత్,



పూరేటి శ్రీనివాసరావు, గురవయ్య,ఐ శ్రీను, టి. రాంబాబు, రామకృష్ణ,దార్ల సురేష్, నల్లా సత్యనారాయణ, కిన్నెర వెంకట రమణ, షణ్ముఖ, గుంట్రు రామకృష్ణ, పాలకుర్తి శ్రీనివాసరావు,బాల మురళి తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలు నడుపుతున్న మైనర్లు..!



**-ప్రమాదంలో ప్రజల ప్రాణాలు**
**-నిబంధనలు ఉల్లంఘిస్తే వాహన యజమానులపై కేసులు... భారీ జరిమానాలు**
**-తల్లిదండ్రుల పర్యవేక్షణ ఏది...?**
**-అధికారుల తనిఖీలు ఎక్కడ...?**



**ప్రజాపక్షం/ తల్లాడ :** మైనర్ల వాహన చోదకత్వం రోజు రోజుకు ఆందోళన కలిగిస్తుంది. డ్రైవింగ్ పై సరైన అవగాహన, అనుభవం లేని బాలబాలికలు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలను నడుపుతూ రహదారులపై తిరుగుతుండటం ప్రమాదాలకు దారి తీసే పరిస్థితులను సృష్టిస్తుంది. చిన్న వయస్సులోనే వాహనాలు నడపడం సరదాగా భావిస్తున్న కొందరు మైనర్లు తమ ప్రాణాలతో పాటు రోడ్డుపై ప్రయాణిస్తున్న ఇతరుల ప్రాణాలను సైతం ప్రమాదంలోకి నెడుతున్నారు. వాహనం నడపడం అంటే కేవలం వేగంగా ప్రయాణించడం మాత్రమే కాదు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన, రహదారిపై అప్రమత్తత, అత్యవసర పరిస్థితుల్లో వాహనాన్ని నియంత్రించే సామర్థ్యం అవసరం. ఇవి పూర్తి స్థాయిలో అలవడని వయసులో వాహనాలు నడపడం వల్ల అదుపుతప్పడం, ఇతర వాహనాలను ఢీకొట్టడం, పాదాచారులకు ప్రమాదం కలగడం వంటి ఘటనలు జరిగే అవకాశం ఉంది. మైనర్లకు వాహనాలు ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**వాహన యజమానులపై కేసులు... భారీ జరిమానాలు :**
చట్టప్రకారం నిర్దేశిత వయసు, చెల్లుబాటయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మోటారు వాహనాలు నడపటం నేరం. మోటారు వాహనాల చట్టంలోని నిబంధనల ప్రకారం, మైనర్ వాహనం నడిపిన సందర్భంలో వాహన యజమాని లేదా బాధ్యత గల సంరక్షకుడిపై కూడా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మోటారు వాహనాల చట్టం సెక్షన్ 199ఎ ప్రకారం మైనర్ చేసిన నేరానికి సంరక్షకుడు లేదా వాహన యజమాని బాధ్యత వహించాల్సి రావచ్చు. చట్టంలో పేర్కొన్న షరతులకు లోబడి రూ. 25వేల జరిమానా, మూడేళ్ల వరకు జైలుశిక్ష విధించే నిబంధనలు ఉన్నాయి. సంబంధిత వాహనం రిజిస్ట్రేషన్‌ను 12 నెలల పాటు రద్దు చేసే నిబంధన కూడా ఉంది. అయితే చట్టంలోని మినహాయింపులు, కేసు పరిస్థితుల ఆధారంగా చర్యలు మారవచ్చు.

**తల్లిదండ్రుల నిర్లక్ష్యం... పిల్లల భవిష్యత్తుకు ప్రమాదం :**
పిల్లలు అడిగారని మోటార్ సైకిళ్లు, స్కూటర్లు చేతికి ఇవ్వడం, వారి వాహన చోదకత్వాన్ని ప్రోత్సహించడం, సరైన పద్ధతి కాదు. పిల్లలకు వాహనం కొనివ్వడమే బాధ్యతగా భావించకుండా రహదారి భద్రతపై అవగాహన కల్పించాలి. చట్టబద్ధమైన వయసు వచ్చే వరకు వాహనాలు నడపకుండా చూడాలి. పిల్లలపై ప్రేమతో చేసే చిన్నపాటి నిర్లక్ష్యం వారి జీవితాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు గుర్తించాలి.

**అధికారుల తనిఖీలు ఎక్కడ...?**
మైనర్లు వాహనాలు నడుపుతున్నారనే అంశంపై రవాణా, పోలీస్ శాఖల అధికారులు నిరంతరం తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది. పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాలు, రద్దీ రహదారులు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం తగు చర్యలు తీసుకోవాలి. అయితే అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలను నిర్ధారించాలంటే తనిఖీల వివరాలు, ఫిర్యాదులు, ప్రమాదాల గణాంకాలు పరిశీలించాల్సి ఉంటుంది. ఒక ప్రమాదం జరిగిన తర్వాత విచారం వ్యక్తం చేయడం కంటే ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యం. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించడం, వాహన యజమానులు చట్టాన్ని పాటించడం, అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చు. మైనర్ల వాహన చోదకత్వాన్ని అరికట్టడం ఒక్క పోలీస్ లేదా రవాణా శాఖ బాధ్యత మాత్రమే కాదు. తల్లిదండ్రులు, వాహన యజమానులు, విద్యా సంస్థలు, అధికారులు సమిష్టిగా బాధ్యత తీసుకోవాలి. చిన్న వయస్సులో వాహనం నడపాలనే సరదా జీవితాంతం మిగిలే విషాదంగా మారకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. అయినప్పటికీ పోలీస్ అధికారుల నిర్లక్ష్యం ఎన్నో ప్రాణాలు పోవడానికి కారణమవుతుందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా పోలీస్ అధికారులు టార్గెట్ నింపటం కోసం రోడ్లపై తనిఖీలు నిర్వహించడం కాకుండా మైనర్ల డ్రైవింగ్ పై శ్రద్ధ వహించాలని పలువురు కోరుకుంటున్నారు.

# ఆళ్లపల్లిలో బతుకమ్మ తల్లి విగ్రహావిష్కరణ

**-ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రారంభం**



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండల కేంద్రంలోని మొద్దులచెరువు సమీపంలో నిర్మించిన బతుకమ్మ తల్లి విగ్రహాన్ని ఆదివారం పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. దివంగత గౌరిశెట్టి వీరలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె కుమారులు, కోడళ్లు గౌరిశెట్టి నాగభూషణరావు, భారతమ్మ, నాగపాణి, లీలావతి, జగన్మోహన్‌రావు, రమాదేవి, సుదర్శనరావు, సుబ్బలక్ష్మి కుటుంబాలు విగ్రహాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. ఈకార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు గౌరిశెట్టి శ్రీనివాసరావు, గౌరిశెట్టి బ్రదర్స్ శివాజీ, చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ వాసం సుస్మిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, నాయకులు అతహార్, శ్రీనివాసరావు, వెంకన్న, శ్రీను, భరత్, బ్రహ్మయ్యతోపాటు గ్రామస్తులు, పాల్గొన్నారు.

# గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం





**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండల కేంద్రంలోని ఆళ్లపల్లి గ్రామంలో రూ 8లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును పినపాక ఎంఎల్ఏ, ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. నూతన రహదారితో గ్రామస్తుల రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే రహదారి ఇబ్బందులు తగ్గనున్నాయి. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. నాణ్యమైన రహదారులు, తాగునీరు, పారిశుధ్యం వంటి ప్రాథమిక సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంఆర్ఓ, ఎంపీడీవో, సంబంధిత అధికారులు, మండల, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన చేతిపంపు ప్రారంభం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి :** ఆళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్‌సి) సమీపంలో ఏర్పాటు చేసిన నూతన చేతిపంపును పినపాక ఎంఎల్ఏ, ఎస్టీ సంక్షేమ కమిటీ ఛైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. దీంతో స్థానిక ప్రజలతో పాటు ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, వారి సహాయకులకు తాగు నీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ తాగునీరు వంటి ప్రాథమిక సదుపాయాలను ప్రజలకు అందించడం ముఖ్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంఆర్ఓ, ఎంపీడీవో, సంబంధిత అధికారులు, మండల, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నీ బాధితులపై కనికరం లేని ప్రభుత్వం

**-నిరుపేదలకు డయాలసిస్ అందక మరణిస్తున్న కిడ్నీ బాధితులు**
**-తక్షణమే మండల కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలి**
**-ఎఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు కార్యదర్శి చాంద్ పాషా**




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఒకరు బతకాలంటే మరొకరు కన్నుమూయాలా.? ఒకరి ఊపిరి నిలపాలంటే మరొకరి ఊపిరి ఆగిపోవాలా.? మండలంలో కిడ్నీవ్యాధిగ్రస్తులు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఒకరి స్థానం ఖాళీ అయితే గానీ మరొకరికి డయాలసిస్ అందని కఠిన స్థితిలో ఉన్నారు. చాలా మంది ఇక్కడ కొన ఊపిరితో డయాలసిస్ సేవల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రమాణాలు చేయడం, ప్రకటనలు ఇవ్వడం తప్ప సేవలు మర్చిపోయిన సర్కారు తీరుతో వీరు విసిగిపోయారు. జనం ప్రాణాలు కాపాడలేని అసమర్థ పాలనపై ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు కార్యదర్శి షేక్ చాంద్ పాషా అసంతృప్తి వ్యక్తం చేశారు. జూలూరుపాడు మండల పరిధిలోని సుమారు 70 మందికి పైగా కిడ్నీ బాధిత దయాలసిస్ నిరుపేద రోగులకు సక్రమంగా దయాలసిస్ అందక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నా, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకునే పరిస్థితి లేదని, మండల కేంద్రంలో వున్న ముప్పై పడకల ఆసుపత్రికి ప్రకటనలకే పరిమితం అవుతుందని, నిరుపేద కుటుంబాలైన కిడ్నీ బాధితుల ప్రైవేట్ ఆసుపత్రులలో దయాలసిస్ చేపించుకునే పరిస్థితులలో లేరని. భద్రాద్రి జిల్లా కేంద్రం మైన కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే అక్కడ బెడ్లు ఖాళీగా లేవని, ఖమ్మం జిల్లా కేంద్రానికి వెళ్లినా అక్కడా అదే పరిస్థితి నెలకొందని, పడకలు కొరత ఉందని, దయాలసిస్ బాధితులను దయాలసిస్ చేయకుండా వెనక్కి పంపుతున్నారని, జూలూరుపాడు మండల వ్యాప్తంగా కిడ్నీ బాధితులు అధికంగా ఉన్నారని, సరైన సమయంలో దయాలసిస్ అందక గత 3 సంవత్సరాల నుంచి మండలంలో పదుల సంఖ్యలో నిరుపేద కిడ్నీ బాధితులు చనిపోతున్నారని, మండల వ్యాప్తంగా పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా లేని కారణంగా ప్రైవేట్ ఆస్పత్రిలో సేవలు పొందలేక మంచానికే పరిమితం అవుతున్నారని, తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి ఏజెన్సీ మండలమైన జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు దయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి కిడ్నీ బాధిత రోగులకు సేవలు అందించాలని చాంద్ పాషా డిమాండ్ చేశారు.

**ప్రకటనలకే పరిమితమా..?**
మండల పర్యటనలకు వచ్చిన ప్రజాప్రతినిధులు ప్రతిసారీ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అది చేస్తాం. ఇది చేస్తాం అని గొప్పలు చెబుతున్నారే తప్ప వాటిని నెరవేర్చడంలో మాత్రం విఫలం అవుతున్నారు. రోగులకు ఉచిత మందులు అందిస్తానని, దయాలసిస్ కేంద్రాలను పెంచుతామని, వారికి పింఛన్లు అందిస్తామని అనేక హామీలిచ్చి వెళ్లిపోతారే తప్ప వాటి గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. నిరుపేదలకు దయాలసిస్ కేంద్రాలు అందుబాటులో లేక దయాలసిస్ చేపించుకుంటున్న కిడ్నీ రోగులకు వైద్యం అందని ద్రాక్షలా మారింది.

# పంచాయితీల్లో పొదుపు చర్యలు పాటించాలి




**ప్రజాపక్షం/కారేపల్లి:** ఎల్‌నినో ప్రభావం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో అన్ని గ్రామ పంచాయితీల్లో పొదుపు చర్యలు చేపట్టాలని సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్ కోరారు. తక్కువ వర్షపాతం నమోదైన పరిస్థితుల్లో నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో నీటి ట్యాంకులు నిండగానే పంపులను నిలిపివేసేలా సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలని తెలిపారు. వేడి వాతావరణం విద్యుత్ వినియోగం పెరుగుతున్నందున అవసరం లేని సమయాల్లో వీధి దీపాలను ఆర్పివేసేలా పర్యవేక్షించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించి, తక్కువ నీటితో సాగయ్యే ఆరు తడి పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన పొదుపు చర్యలను గ్రామ పంచాయితీల్లో అమలు చేసి నీరు, విద్యుత్ వనరులను సంరక్షించాలని కోరారు.

# వైరా సమగ్రాభివృద్ధిపై సమీక్ష



## రింగు రోడ్డు షాపింగ్ కాంప్లెక్స్, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం, రిజర్వాయర్ పర్యాటక అభివృద్ధిపై చర్చ

**ప్రజాపక్షం/వైరా:** వైరా నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి చేపట్టాల్సిన కీలక పనులపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతి, కార్యాచరణ ప్రణాళికలపై చర్చించారు. వైరా రింగు రోడ్డు సెంటర్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, మండల ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఏర్పాటు, వైరా రిజర్వాయర్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే అంశాలపై సమీక్షించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా పట్టణంలో వాణిజ్య కార్యకలాపాలకు ప్రోత్సాహం లభించడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యే అవకాశాలపై చర్చించారు. వైరా తల్లాడ రహదారికి రిజర్వాయర్ మీదుగా రెడ్డిగూడెం మార్గంలో రెండు వరుసల రహదారిగా అభివృద్ధి చేసే అంశాన్ని సమావేశంలో ప్రస్తావించారు. రహదారి విస్తరణతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ప్రాంతీయ అనుసంధానాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై చర్చించారు. అలాగే వైరా మున్సిపాలిటీ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, పట్టణ అభివృద్ధి సేవలు ప్రజలకు అవసరమైన వసతుల మెరుగుదలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వైరా ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యతమిస్తూ వాణిజ్య వసతులు , పర్యాటక రంగం, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్‌దత్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బసవతారకం సేవలు అభినందనీయం

## మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత



**ప్రజాపక్షం/మధిర:** ప్రాణాంతక మహమ్మారి బారిన పడకుండా పేద, మధ్యతరగతి ప్రజలను కాపాడటమే ధ్యేయంగా హైదరాబాద్‌కు చెందిన ప్రఖ్యాత బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ అద్భుతమైన సేవలు అందిస్తుందని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత కొనియాడారు. స్థానిక ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో మధిర రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో బసవతారకం ఆసుపత్రి సౌజన్యంతో ఈ ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత, సీనియర్ వైద్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, క్యాంప్ ఇంచార్జ్ గూడూరు సత్యనారాయణతో కలిసి ఉచిత మెగా క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత మాట్లాడుతూ ఆర్థిక స్థోమత లేక మెరుగైన వైద్యానికి దూరంగా ఉంటున్న గ్రామీణ, పట్టణ ప్రాంత పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను నేరుగా చేరువ చేయాలనే గొప్ప లక్ష్యంతోనే బసవతారకం ఆసుపత్రి ఈ ఉచిత శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. క్యాన్సర్‌ను తొలి దశలోనే పసిగట్టి, సకాలంలో వైద్యం అందిస్తే ఈ వ్యాధిని పూర్తిగా జయించవచ్చని ఆమె తెలిపారు. సమాజంలో క్యాన్సర్‌పై పూర్తిస్థాయి అవగాహన కలిపించడంతో పాటు అత్యాధునిక నిర్ధారణ పరీక్షలను సామాన్యుడి ముందుకు తీసుకురావడమే ఈ వైద్య శిబిరం ప్రధాన ఉద్దేశ్యమని, ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల తగిన శ్రద్ధ వహించి ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో స్థానిక ప్రజలు పాల్గొని, నిపుణులైన వైద్యుల ఆధ్వర్యంలో ఉచితంగా పరీక్షలు చేయించుకొని తగిన వైద్య సలహాలు పొందారు. ఈ కార్యక్రమంలో రిక్రియేషన్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు చావా రామకృష్ణ, గద్దం శ్రీనివాసరావు, ములకలపల్లి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు రూ.2.10లక్షల ఆర్థికసాయం



## వైద్య, సాంకేతిక విద్య అభ్యసిస్తున్న 17మంది విద్యార్థులకు చేయూత

**ప్రజాపక్షం/వైరా:** వైద్య, సాంకేతిక విద్య అభ్యసిస్తున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు సోమవరం గ్రామానికి చెందిన ప్రముఖ ప్రవాస భారతీయుడు కొండబోలు సురేష్, ఆయన సోదరి కొండబోలు లలిత రూ.2.10లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వైరా పరిసర ప్రాంతాలకు చెందిన 17 మంది విద్యార్థులకు ఈ సహాయాన్ని అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. వైరా గుట్టబడి పాఠశాలలో మండల విద్యాధికారి చావా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైరా ఏసిపి సారంగపాణి, వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ చేతుల మీదుగా విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏసిపి సారంగపాణి మాట్లాడుతూ విద్యకు మించిన సంపద లేదన్ని, విద్యా ద్వారానే వినయం, ఉన్నత స్థానం లభిస్తాయని పేర్కొన్నారు.విద్యార్థులు కష్టపడి చదివి తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. వైద్య విద్య అభ్యసిస్తున్న 8 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున, సాంకేతిక విద్య అభ్యసిస్తున్న 8 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున సాంకేతిక విద్య అభ్యసిస్తున్న 9 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.2.10లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ వైద్య విద్య ఎంతో బాధ్యతతో కూడుకుందని, వైద్య విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి వైద్యులుగా పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. వైద్య విద్య ఖర్చుతో కూడుకుందని, అలాంటి పరిస్థితుల్లో పేద విద్యార్థులకు కొండబోలు సురేష్, లలిత ఆర్థిక సహాయం అందించడం గొప్ప విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ ముళ్లపాటి విజయలక్ష్మి, జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు కాపా మురళీకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్ ఫణితి సైదులు, ముళ్లపాటి సీతారాములు, సోమవరం గ్రామానికి చెందిన బెజవాడ మరబోరావు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసచారి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సూర్యం, భాస్కరరావు, ఉపేందర్‌రావు, పుప్పాల రామారావు, తోటకూర రఘు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/మధిర:** శాంతి థియేటర్స్ ఎంఆర్‌ఎఫ్ టైర్స్ సమీపంలో డివైడర్స్ స్కూటీ ఢీకొట్టిన ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మంచినీళ్ల క్యాన్ తీసుకొని వెళుతున్న యువకుడు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టడంతో తలకు బలమైన గాయం ఏర్పడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. 108కి సమాచారం అందించడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి యువకుడిని తరలించడం జరిగింది. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి యువకుడిని తరలించడం జరిగింది. క్షతగాత్రుడు జిలుగుమాడు గ్రామానికి చెందిన గుండె రణదీప్(20) గాగుర్తించారు. ఇతను రైల్వే ఉద్యోగిగా పనిచేస్తున్న కిషోర్ కుమార్ కుమారునిగా సమాచారం.



# ఉత్సవాలు ఐక్యతకు దోహదపడాలి

**-ఏసిపి రమణమూర్తి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉత్సవాలు ఐక్యతకు, అభివృద్ధికి దోహదపడాలని ఖమ్మం ఏసిపి రమణమూర్తి ఆకాంక్షించారు. 26 ఏళ్లుగా శ్రీ స్తంభాద్రి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రోత్సవాలు జరపడం అభినందనీయమన్నారు. ఆదివారం నవరాత్రోత్సవాల్లో భాగంగా నర్సింహాస్వామి మండపం వద్ద ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ స్తంభాద్రి యూత్ అసోసియేషన్ మత సామరస్యాన్ని కాపాడుతూ చిన్న పెద్ద అనే తేడా లేకుండా యువత పెడ మార్గాలు పట్టకుండా మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని యూత్ అసోసియేషన్‌ను ఆయన ప్రశంసించారు.ఈ ప్రాంతంలో జరిగిన పలు కార్యక్రమాలకు తాను గతంలోనూ హాజరయ్యానని రమణమూర్తి తెలిపారు. యువత సామాజిక చైతన్యంతో మసులుకోవాలని అప్పుడే శాంతి భద్రతలు మెరుగుపడతాయని ఆయన తెలిపారు. మహా అన్నదాన కార్యక్రమంలో జిఆర్ ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు శ్రీనివాస్, స్తంభాద్రి అసోసియేషన్ చైర్మన్ యానాలి సాంబశివరెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్, నాయకులు సతీష్‌రెడ్డి, రామకృష్ణ, నిరంజన్, ఎస్‌కె సైదా, ఉపేందర్‌రెడ్డి, ఏఐవైఎఫ్ నాయకులు సిహెచ్ దుర్గానాథ్, శోభ, రాణి, కళావతి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

# వైరాలో 6టు 6 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలో నిర్వహిస్తున్న 6టు6 క్రికెట్ టోర్నమెంట్‌ను ఖమ్మం జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ ఫణితి సైదులు, వుంద్ర శ్యామ్‌బాబు, పొదిలి హరినాథ్, పువ్వాళ్ల రాము, తోటకూర శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారులను నిర్వాహకులు, అతిథులు ప్రోత్సహించారు. క్రీడలు యువతలో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు స్థానిక క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ కమిటీ సభ్యులు, క్రీడాకారులు, స్థానికులు పాల్గొన్నారు.

# గుంతలతో పొంచివున్న ప్రమాదాలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని కల్లూరు టూ మధిర రహదారిలో బోడి మల్లె, వాచ్య నాయక్ తండ, లింగాల, చెన్నూరు, పెద్ద కోరుకొండి ల వద్ద రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. వాహనదారులు గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం పడితే గోతు లో నీరు చేరి గుంతలో ఏముందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి కాల సమయంలో వాహనదారులు వాహనాలు ముందుకు కదలక ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు తెలుపుతున్నారు. మండల కేంద్రానికి పరిసర గ్రామాల ప్రజలు వాహనాలపై వెళ్ళాలన్నా రావాలన్నా నరకయాతన పడాల్సి వస్తుందని వారు పేర్కొంటున్నారు. పెద్ద కోరుకొండి నుండి కల్లూరు వరకు 14 కిలోమీటర్ల దూరంలో ప్రయాణికులు గంటల కొద్దీ నరకయాతన పడాల్సి వస్తుంది. గుంతల మయంగా తయారైన రోడ్డు ఇబ్బందులు వాహన వాహనదారులు కు ఒళ్ళు హూనమైతుంది. ప్రతిరోజు మధిర టు కల్లూరు తోపాటు స్థానికంగా ఉన్న మండల ప్రజలు అనునిత్యం మండల కేంద్రానికి రాకపోకలు కొనసాగిస్తున్న సమయంలో ఇబ్బందులు పడాల్సివస్తుంది. ఈ విషయమై మండల ఆర్ అండ్ బి అధికారిని వివరణ కోరగా మరమ్మత్తులకు ప్రతిపాదనలు పంపించామని వివరించారు.

# ఆర్‌టిసి ఎండిని కలిసిన మధిర ఎంప్లాయిస్ యూనియన్



**ప్రజాపక్షం/మధిర:** తెలంగాణ ఆర్‌టిసి గుర్తింపు సంఘ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ ఘన విజయం సాధించిన సందర్భంగా హైదరాబాద్‌లోని లేబర్ కమీషనర్ కార్యాలయం నుంచి అధికారిక గెలుపు ధృవీకరణ పత్రాన్ని స్వీకరించిన అనంతరం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ నాయకులు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పాటి అప్పారావుతో కలిసి మధిర డిపో కమిటీ ప్రతినిధులు వై.నాగిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. గుర్తింపు సంఘ ఎన్నికల్లో కార్మికులు ఎంప్లాయిస్ యూనియన్‌పై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞలు తెలియజేస్తూ కార్మికు లహక్కుల పరిరక్షణ, ఆర్‌టిసి ప్రభుత్వం విలీనం , ఉద్యోగ భద్రత, పెండింగ్ సమస్యల పరిష్కారం, ఉద్యోగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణకుమారి, మధిర డిపో కార్యదర్శి షేక్ నాగులమీరా, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎంఎల్సీగా సర్వోత్తం రెడ్డిని గెలిపించాలి




**-నవంబర్ 6లోగా ఓటరు నమోదు పూర్తి చేయాలి**
**-ఎంఎల్ఏ కోరం కనకయ్య పిలుపు**

**ప్రజాపక్షం/ఇల్లందు:** ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డిని గెలిపించాలని ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బయ్యారం మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు జూలకంటి సీతారాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రులైన యువత నవంబర్ 6లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, గతంలో నమోదైనవారు పునరుద్ధరణ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

**యువతకు 70వేల ఉద్యోగాలు ఇచ్చాం..**

కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో 70వేల ఉద్యోగాలు కల్పించిందని, పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని కనకయ్య తెలిపారు. బయ్యారం మండలంలో ప్రతి గడపకూ ప్రభుత్వ పథకాలు అందాయని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లి సర్వోత్తం రెడ్డి విజయానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. సర్వోత్తం రెడ్డి కుటుంబం తరతరాలుగా కాంగ్రెస్కు సేవలందిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎల్నినో ప్రభావంతో సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రజలు నీరు, విద్యుత్ను పొదుపుగా వినియోగించాలని కోరారు.

**లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు...**

వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఎంఎల్ఏ కోరం కనకయ్య లబ్ధిదారులకు అందజేశారు. ఈకార్యక్రమంలో ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, బయ్యారం మాజీ సొసైటీ ఛైర్మన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి మూల మధుకర్రెడ్డి, ఇల్లందు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బిజ్జా వెంకటేశ్వర్లు, బయ్యారం సర్పంచ్ శాంతి కిషన్, కొత్తపేట గంధంపల్లి సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్, జగ్గుతండా సర్పంచ్ లలిత, కోయగూడెం సర్పంచ్ లింగ నాయక్, కస్తూరినగరం సర్పంచ్ రవి నాయక్, బాలాజీపేట సర్పంచ్ మాలూత్ పార్వతి శ్రీనివాస్, జగ్రావుపేట సర్పంచ్ మోహన్ జి, ఇస్లాపురం సర్పంచ్ ఎట్టి సరోజిని, ఉప్పలపాడు సర్పంచ్ పానుగోతు వెంకన్న, నర్సితండా సర్పంచ్ సేవాలాల్, చర్లపల్లి సర్పంచ్ బాలకృష్ణ, రామచంద్రపురం సర్పంచ్ వనిత మంగీలాల్, మొట్ల తిమ్మాపురం సర్పంచ్ సాంబశివ, తెల్లం భిక్షం, చాదర్లమూడి భాస్కర్, తిరుమల ప్రభాకర్రెడ్డి, తమ్మిశెట్టి వెంకటపతి, రామచంద్రపురం ఉప సర్పంచ్ తొట్టి కృష్ణ, సింగారం రాందాస్ పాల్గొన్నారు.

# పరారీలో ఆరుగురు నిందితులు

**- మార్చురీ వద్ద బోరున విలపించిన కుటుంబ సభ్యులు**
**- దోషులను శిక్షించాలంటూ డిమాండ్**





**ప్రజాపక్షం/భద్రాచలం:** పాల్వంచ నవభారత్ హెచ్పి గ్యాస్ మేనేజర్ సివిల్ సప్లై ఉద్యోగి లక్ష్మీనారాయణ ఆత్మహత్యకు సంబంధించిన ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నారని, ఆ ఆరుగురిపై ఇప్పటికే కేసు నమోదైనట్లు భద్రాచలం సిఐ రాజు తెలిపారు. ఆ ఆరుగురి వేదింపులు తాళలేక లక్ష్మీనారాయణ భద్రాచలంలోని ఓ ప్రైవేటు లాడ్జీలో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కాగా లక్ష్మీనారాయణ తన ఆత్మహత్యకు సంబంధించిన పలు కీలక అంశాలను సూసైడ్ నోట్లో వెల్లడించాడు. తన కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్గా పనిచేస్తున్న ఓ మహిళ గ్యాస్ బ్లాక్లో అమ్ముకుందామని మానసికంగా వేదిస్తోందని, ఆమే వేదింపులు తట్టుకోలేక జూలై 27నుండి 21 రోజుల పాటు సెలవు పెట్టినట్లు ఆ సూసైడ్ నోట్లో ఉంది. ఇక్కడి పరిస్థితుల దృష్ట్యా తనను బదిలీ చేయాలని కలెక్టర్, సివిల్ సప్లై డిఎం కు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ బదిలీ చేయకుండా ఇక్కడే పనిచేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. కనీసం సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని పలుమార్లు కోరినప్పటికీ పట్టించుకోలేదన్నారు. తాను విధుల్లో చేరిన తర్వాత కూడా వేదింపులు ఆగలేదని, సదరు మహిళ భర్తతో పాటు పలువురు ఆఫీస్కు వచ్చి దుర్భాషలాడినట్లు నోట్లో ఉంది. కానీ 30వ తేదిన డేటా ఎంట్రీ ఆపరేటర్ను తాను సెక్సువల్ హెర్రాస్మెంట్ చేసినట్లు ఫిర్యాదు చేసిందని, ఆ ఫిర్యాదును వెనక్కు తీసుకునేందుకు రూ.1 కోటి డిమాండ్ చేశారని చెప్పారు. ఫిర్యాదుపై అధికారులు 16వ తేదిన క్షేత్రస్థాయి విచారణ సైతం చేపట్టారన్నారు. సదరు మహిళ భర్తతో పాటు మరో నలుగురు రిపోర్టర్లు సోషల్ మీడియాలో బదనామ్ చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని రాసుంది. ఆర్థిక బెదిరింపులు, మానసిక ఇబ్బందులు పెట్టడం కారణంగానే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మృతదేహం వద్ద లభ్యమైన సూసైడ్ నోట్లో రాసుంది. ఇదిలా ఉండగా మృతుడు లక్ష్మీనారాయణ కుటుంబీకులకు ఒత్తిడి ఇబ్బందులు తాళలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, మీ కడుపున కొడుకుగా పుడతానని పిల్లలకు మెసేజ్ పంపించాడు. తనను క్షమించాలని, పిల్లలకు అమ్మను సరిగా చూసుకోమని, భార్యకు తన అమ్మ జాగ్రత్త అంటూపెట్టిన మెసేజ్లు బయటకు రావడంతో కన్నీరు పెట్టిస్తోంది. ఆదివారం మృతదేహాన్ని స్వాధీనం చేసుకునేందుకు భార్య, పిల్లలతో పాటు పలువురు కుటుంబ సభ్యులు సన్నిహితులు భద్రాచలం మార్చురీకి వచ్చి పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని స్వాధీన పర్చుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ కుటుంబీకులు బోరిన విలపించారు. ఆయన కుమార్తె మాట్లాడుతూ తన తండ్రి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని దోషులను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టవద్దని, చట్టపరంగా దోషులకు శిక్షపడేంత వరకు పోరాటం చేస్తామని తెలిపారు. మరో ప్రక్క అంత్యక్రియల సమయంలో వారి కులం పెద్దలు, సన్నిహితులు సైతం ఆత్మహత్య చేసుకునేందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, వేదింపులకు పాల్పడిన వారిని వదిలిపెట్టవద్దని డిమాండ్ చేశారు. పారీలో ఉన్న ఆరుగురు నిందితులు పట్టుబడితే గానీ పూర్తి విషయాలు వెలుగులోనికి వచ్చే అవకాశం ఉంది.

# కనకదుర్గాదేవిగా అమ్మవారి దర్శనం



**ప్రజాపక్షం/మధిర:** మధిర పట్టణంలోని లడక్ బజార్లో దేశభక్తి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాలు భక్తిభావంతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు కనకదుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడి, ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు అన్నం అందించడం ద్వారా సేవాభావాన్ని చాటిన నిర్వాహకుల కార్యక్రమాన్ని పలువురు అభినందించారు. భక్తి, సేవ పమ్మిళితంగా సాగిన ఈ కార్యక్రమం ఉత్సవాలకు మరింత శోభను తీసుకొచ్చింది.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/ తల్లాడ :** బాల భారతి విద్యాలయంలో 2005 2006 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు తమ మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంతోషంగా ఉల్లాసంగా గడిపారు. పాఠశాలలో చదువుకున్న రోజుల్లో ఎదురైన అనుభవాలు, ఉపాధ్యాయులు అందించిన మార్గదర్శకత్వ, స్నేహితులతో పంచుకున్న అనుభూతులను గుర్తు చేసుకున్నారు. చదువు పూర్తయిన తర్వాత తాము ఎంచుకున్న వృత్తులు, ప్రస్తుతం స్థిరపడిన రంగాలు, జీవితంలో తాము సాధించిన విజయాలను ఒకరికొకరు పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పి, క్రమశిక్షణతో కూడిన జీవితానికి పునాదులు వేసి ఉన్నత స్థాయికి ఎదగడానికి మార్గనిర్దేశం చేసిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులతో తమ అనుభవాలను పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కెవిఎస్ఎం విద్యా సంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ కె. శ్రావణి, రాధా, పూర్వ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పదవ తరగతి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# దుర్గాదేవికి కందాళ ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలం నాయకన్గూడెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ ఛత్రపతి శివాజీ మహరాజ్ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి మండపం వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాన్ని పాలేరు మాజీ ఎంఎల్ఏ కందాళ ఉపేందర్రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రాజుపేట గ్రామంలోని రామాలయం వద్ద దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈకార్యక్రమాల్లో కూసుమంచి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జాతరకు ముస్తాబైన కోట మైసమ్మ ఆలయం



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం ఉసిరికాయలపల్లిలోని శ్రీ కోట మైసమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగసుందరంగా అలంకరించారు. రంగురంగుల అలంకరణలతో ఆలయ ప్రాంగణం ఆకర్షణీయంగా మారింది. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేశారు. జాతర సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామ ప్రజలకు ఆయురారోగ్యాలు కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ జాతరతో ఉసిరికాయలపల్లిలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారనున్నాయి.

# కరువు సహాయక చర్యలు చేపట్టాలి

**-ఈనెల 26,27 తేదీల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు**




**ప్రజాపక్షం/కూసుమంచి:** రాష్ట్రంలో కరువు సహాయక చర్యలు చేపట్టి, పంట నష్టపరిహారం ప్రకటించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలు నివారించి, ట్రూ అప్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని కోరారు. ఈనెల 26,27 తేదీల్లో జిల్లా కలెక్టకేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కూసుమంచిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో అక్టోబర్ 15 నాటికి 23శాతం లోటు వర్షపాతం నమోదైందని, 18 జిల్లాల్లోని 320 మండలాల్లో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. నీటి వనరులు అడుగంటడం, విద్యుత్ కోతలు, తక్కువ వోల్టేజీతో పంటలు ఎండిపోతున్నాయని, మోటార్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు నేపథ్యంలో పంట నష్టపరిహారం, పంట రుణమాఫీ, వ్యవసాయ కూలీలకు ఉపాధి ప్యాకేజీ, పశుగ్రాసం, తాగునీటి సరఫరా కల్పించాలని డిమాండ్ చేశారు. భూమిలేని వ్యవసాయ కూలీలకు నెలకు రూ 1,000 ఆర్థిక సాయాన్ని బకాయిలతో సహా చెల్లించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి, రాష్ట్ర నాయకులు ఆకుల పాపయ్య, మందారి డేవిడ్ కుమార్, బండారి ఐలయ్య, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బజ్జూరి వెంకట్రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఏనుగుల ప్రకాశ్, జిల్లా నాయకుడు కలకొండ సురేష్ పాల్గొన్నారు.

# కనకం చిన్న గురువయ్య మృతి



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచికి చెందిన కనకం చిన్న గురవయ్య(85)మృతి చెందారు. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామంలో విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆదివారం ఆయన స్వగృహానికి చేరుకుని పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గురవయ్య మనవడు ఆకారపు రవిచంద్ర గతంలో పీడీఎస్యూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేయగా, ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డికి అనుచరుడిగా ఉన్న రవిచంద్ర కుటుంబంలో తాత మృతి తీవ్ర విషాదాన్ని నింపింది. నివాళులర్పించిన వారిలో పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి సంధ్య, ఝాన్సీ, రాష్ట్ర నాయకురాలు అనురాధ, బీజేపీ ఖమ్మం జిల్లా నాయకుడు గుండా ఉపేందర్రెడ్డి, పాలేరు ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయ ఇన్చార్జి భీమ్ రెడ్డి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బజ్జూరి వెంకట్రెడ్డి, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండి ఆఫీసుద్దీన్, దామోదర్రెడ్డి, కూసుమంచి మాజీ ఎంపీటీసీ మాదాసు ఉపేందర్రావు, గ్రామ సర్పంచ్ కొండ మహిపాల్, న్యూడెమోక్రసీ నాయకులు వెంకట్రామిరెడ్డి, ఐ వెంకన్న, తదితరులు ఉన్నారు.

# 21 నుండి ఆర్థిక సమ్మిళిత శిబిరాలు

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** జిల్లాలో ఈనెల 21 నుండి డిసెంబర్ 31 ఆర్థిక సమ్మిళిత సంతృప్తి ప్రచార శిబిరాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అంకిత్ తెలిపారు. అన్ని గ్రామపంచాయితీల్లో పట్టణ స్థానిక సంస్థల్లో జరిగే ఈ శిబిరాల్లో ప్రధాన మంత్రి జన్ధన్యోజన జీవనజ్యోతి బీమా సురక్షా బీమా అటల్ పెన్షన్ యోజన పథకాల్లో అర్హులకు నమోదు కల్పించడంతో పాటు బ్యాంకు ఖాతాలు కూడా ప్రారంభిస్తారన్నారు. ఆధార్ అనుసందానం, ఈ కేవైసి నామినీ వివరాల నమోదు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు కిసాన్ క్రిడెట్ కార్డులు, పంటల బీమా పథకాలపై కూడా సేవలు అందించనున్నారని చెప్పారు. ప్రతీ గ్రామపంచాయితీ పట్టణ స్థానిక సంస్థల పరిధిలోకనీసం ఒక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. అర్హులైన ప్రజలు ఆధార్ పాన్ కార్డు బ్యాంక్ పాస్బుక్ మొబైల్ నంబర్ తదితర వివరాలతో శిబిరాలకు హాజరై వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.